
# న్యాయమూర్తులూ ఆలోచించండి!



# అన్నీ మీరే పరిష్కరించగలరా...

**జూ**నియర్ డాక్టర్ల సమ్మె విషయంలో రాష్ట్ర హైకోర్టు అనుసరించిన వైఖరి చాలా చర్చకు దారితీసింది. డాక్టర్లను సమ్మె చేయకుండా ఆపి హైకోర్టు రోగుల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకున్నవారు ఉన్నారు. సమ్మె హక్కు అనే దానిని మొత్తంగా నిరాకరించే వైఖరి హైకోర్టు అనుసరించడం ప్రజాస్వామ్యానికి నష్టకరం అని విమర్శించిన వారూ ఉన్నారు.

హక్కుల సంఘాలు రెండవ వాదన వైపే మొగ్గు చూపించాయి. మరయితే రోగుల ప్రాణం - వారి జీవించే హక్కు - మా దృష్టిలో విలువ లేనిదని అర్థమా? సమ్మె హక్కుకు అనుకూలంగా మాట్లాడిన వారిని హైకోర్టు ఇదే ప్రశ్న అడిగింది. వైద్యుల సమ్మె హక్కు కంటే రోగుల జీవించే హక్కు ముఖ్యమనింది.

ఇప్పుడు జూనియర్ డాక్టర్ల కేసులో హైకోర్టు తన తుదితీర్పు ఇచ్చేసింది. ఏ సమస్యల పరిష్కారం కోసమయితే జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగారో వాటి విషయంలో హైకోర్టు ఎంతమేరకు న్యాయం చేయగలిగిందీ ఇప్పుడు స్పష్టంగా చూడగలుగుతున్నాం. ఈ నేపథ్యంలో సమ్మె హక్కు విషయంలో హైకోర్టు వైఖరిని విమర్శనాత్మకంగా పరిశీలించడం మన మనుగడకూ మన హక్కుల మనుగడకూ చాలా అవసరం.

ఒక్క సమ్మె విషయంలోనే కాదు. సమ్మె అనేది ఒకానొక ఆందోళన రూపం. అది ఎదుటి వారిపైన ఒత్తిడి పెట్టడం ద్వారా మన కోరికలను వినేటట్టు చేస్తుంది. పరిష్కరించేటట్టు కూడా చేయగలదు. అయితే అటువంటి ఆందోళన రూపాలు ఇంకా కూడా ఉన్నాయి. బంద్, రాస్తారోకో, నిరాహారదీక్ష, పికెటింగ్, ప్రదర్శన, ఊరేగింపు మొదలయినవన్నీ ఈ లక్షణాన్ని కలిగి వున్నాయి. సమ్మె విషయంలోనే కాక వీటన్నిటి విషయంలోనూ న్యాయస్థానాలు అనుసరిస్తున్న వైఖరిని పరిశీలించవలసి ఉంది.

ఎందుకు?

ఇవి ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలు లేక నడవడిక పట్ల బాధిత ప్రజావర్గాల నిరసనను సమర్థవంతంగా తెలియజేసే సాధనాలు కాబట్టి. ఇవే లేకపోతే ప్రజాస్వామ్యంలో ప్రజల చొరవ రెండు సందర్భాలకు కుదించబడుతుంది. ఒకటి వోటు వేసేటప్పుడు, రెండవది కోర్టులో కేసు వేసేటప్పుడు.

జూనియర్ డాక్టర్లను హైకోర్టు ఇందులో రెండవ ప్రక్రియలోకి ఆహ్వానించి వారిచేత సమ్మె విరమింపజేసింది కాబట్టి ఆ ప్రక్రియ ఏపాటి ప్రత్యామ్నాయం అనేది ఇప్పుడు చూడగలం. హైకోర్టు తీర్పులో ఏమీ లేదని కాదు, కొంత ఉంది. కానీ ఏది లేదో చూస్తే తప్ప

ఉద్యమించే హక్కు అక్కరలేదు, కోర్టుకు రండి అనే వైఖరి ఏ మేరకు న్యాయం చేయగలగుతుందో అర్థం కాదు.

ప్రైవేట్ వైద్య విద్యా సంస్థలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారనీ, వాటిలో చదివే విద్యార్థులకు పాఠాలు చెప్పే పంతుళ్లు లేరనీ, వారు వైద్య విద్యను అభ్యసించడానికి అవసరమయిన అనుబంధ ఆస్పత్రులు ఉన్నట్టు చూపించడానికి అరువు డాక్టర్లనూ, అరువు పేషంట్లనూ అప్పటికప్పుడు యాజమాన్యాలు సమకూర్చుకుంటున్నాయి తప్ప నిజంగా ఆస్పత్రులేవీ లేవనీ జూనియర్ డాక్టర్లు అన్నారు. ఈ విషయంలో ఇన్‌స్పెక్షన్ చేసే అధికారం ఉన్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుడ్డిగా వ్యవహరిస్తున్నది తప్ప నిజాన్ని చూడడం లేదన్నారు. రాష్ట్రంలోని 21 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, 16 ప్రైవేట్ డెంటల్ కాలేజీలలో నిజంగా అధ్యాపకులు ఉన్నారా, నిజంగా వాటికి ఉండవలసిన అనుబంధ ఆస్పత్రులు ఉన్నాయా అన్న విషయం పరిశీలించడానికి ఒక స్వతంత్ర కమిటీని నియమించమని కోర్టును కోరారు. అసలు వైద్య విద్య ఇంతగా ప్రైవేట్‌రంగంలో ఎందుకుండాలి, ప్రభుత్వమే ఈ కాలేజీలు నడపవచ్చుకదా అన్నారు.

## ఓటు ఒక్కటే మార్గమా...

ఇందులో చివరి ప్రశ్న ప్రభుత్వ విధాన నిర్ణయాలకు సంబంధించినది కాబట్టి తాను జోక్యం చేసుకోలేననీ, విద్యా వ్యవస్థలో ప్రైవేటీకరణ ఏ మేరకు ఉండవచ్చుననే చర్చ కోర్టులో చేయవద్దనీ హైకోర్టు అనింది. కరెక్టే. మరయితే ప్రజలు ఏం చేయాలి? సాధారణ ప్రజలు ఆందోళన చేస్తే అడిగే దిక్కు ఉండదు. సమ్మె చేసి ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టే స్థితిలో ఉన్నవారిని కోర్టు సమ్మె చేయనివ్వదు. కోర్టునే జోక్యం చేసుకొమ్మంటే అది నా పరిధిలో లేని విషయం అంటుంది. అయిదేళ్లకొకసారి వేసే వోటే దీనికి పరిష్కారమా? అది సరిపోతుందా?

పోనీ, ప్రైవేట్ వైద్య కళాశాలల 'అద్దె టీచర్లు – అద్దె పేషంట్లు' వ్యవహారంపైన విచారణ కమిటీ వేయండి అని అడిగితే దానికయినా కోర్టు ఒప్పుకుందా అంటే లేదు. ఆ సంస్థలను పరిశీలించి వారికి అనుమతి ఇచ్చే అధికారం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఉంది; మెడికల్ కౌన్సిల్ ఆ పని చేసేసింది; చట్టబద్ధమైన అధికారం ఉన్న సంస్థ తన పని సక్రమంగా చేయలేదని దారిన పోయేవాళ్లెవరో అంటే కోర్టు ఆ సంస్థను శంకించనవసరం లేదు; కాబట్టి ప్రైవేట్ మెడికల్ కాలేజీలను కేసులో ప్రతివాదులుగా చేర్చడానికి సహితం హైకోర్టు ఒప్పుకోలేదు. అరడజను కాలేజీల విషయంలో వారు చెప్పుకుంటున్న అధ్యాపకుల సంఖ్య ఎంత, నిజంగా ఉన్నదెందరు అన్న సమాచారం కోర్టు ముందు ఉంచినా కూడా ఒప్పుకోలేదు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంకొంచెం సమర్థంగా, పారదర్శకంగా పనిచేయాలి అనీ, ఢిల్లీలో ఒక కార్యాలయం ఉంటే చాలదు, ప్రైవేట్ వైద్య విద్యా సంస్థలు ఈ రాష్ట్రంలో చాలా వెలిశాయి కాబట్టి వీలయితే హైదరాబాద్‌లో కూడా ఒక కార్యాలయం నెలకొల్పాలి అనీ మాత్రం సూచన కోర్టు ఇచ్చింది. దానితో పరిస్థితి చక్కబడకపోతే? వైద్య విద్యా వ్యవస్థ తమ కళ్ల ముందు నాశనం అవుతూ వుంటే దగ్గరి నుండి అన్ని విషయాలూ గమనిస్తున్న జూనియర్ డాక్టర్లు నిస్సహాయంగా చూస్తూ ఉండవలసిందేనా? ఈ వ్యవస్థను చక్కబెట్టే చట్టబద్ధమైన అధికారం ఉన్న సంస్థ ఒకటి ఉంది అనీ, దానిని పర్యవేక్షించడానికి కోర్టు పూనుకోజాలదనీ హైకోర్టు ప్రకటించిన అభిప్రాయం, న్యాయస్థానాల అధికారాల పరిధులకు సంబంధించిన సంప్రదాయక ఆలోచనా రీతికి లోబడిన అభిప్రాయమే కావచ్చును. మరి న్యాయస్థానం ఈ కారణంగా జోక్యం చేసుకోలేని పక్షంలో ప్రజలు వేరే ఏ విధంగా జోక్యం చేసుకోవాలి? వైద్యులు సమ్మె చేసి వైద్య వ్యవస్థను తాత్కాలికంగా స్తంభింపజేస్తేనో, ప్రజా సంఘాలు భారీ ప్రదర్శన చేపట్టి రాజధానిని కొంతకాలం పాటు స్తంభింపజేస్తేనో, వైద్యశాఖామాత్యుడిని ఘెరావ్ చేసి ఒక పూట తిండీ, నీళ్లూ లేకుండ చేస్తేనో పరిష్కారం దొరకొచ్చునేమో. కానీ సమ్మెలూ, ప్రదర్శనలూ, ఘెరావ్‌లూ చెల్లవనీ, రాజ్యాంగ విరుద్ధమనీ న్యాయస్థానాలు ప్రకటించి వాటిని సాగనివ్వని పక్షంలో ప్రజలకు వేరే మార్గం ఏముంది?

## ఏ ఆందోళనా వద్దంటే ఎలా?

న్యాయస్థానాలు తమ పరిమితుల రీత్యా అన్ని విషయాలలోనూ న్యాయం చేయలేవు. ఆ పరిమితులను కొంత సరళంగా వ్యాఖ్యానించడం ద్వారా కొంచెం ఎక్కువ న్యాయం చేసే ప్రయత్నమైనా చేస్తారా అంటే ఇరవై ఏళ్లనాడు ఈ విషయంలో న్యాయమూర్తులు కొంత సంసిద్ధత చూపారు గానీ ఇప్పుడు ససేమిరా అంటున్నారు. మరి ప్రజలకు అయిదేళ్లకొకసారి వేసే వోటే దిక్కా? దానితో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయా? ఎన్నికలలో ఇచ్చిన హామీలను అధికారానికి వచ్చిన తరువాత నిలబెట్టుకోవాలన్న నియమమేదీ

న్యాయస్థానాలు తమ పరిమితుల రీత్యా అన్ని విషయాలలోనూ న్యాయం చేయలేవు. ఆ పరిమితులను కొంత సరళంగా వ్యాఖ్యానించడం ద్వారా కొంచెం ఎక్కువ న్యాయం చేసే ప్రయత్నమైనా చేస్తారా అంటే ఇరవై ఏళ్లనాడు ఈ విషయంలో న్యాయమూర్తులు కొంత సంసిద్ధత చూపారు గానీ ఇప్పుడు ససేమిరా అంటున్నారు. మరి ప్రజలకు అయిదేళ్లకొకసారి వేసే వోటే దిక్కా? దానితో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయా?

లేనిచోట వోటు హక్కు బలహీనమైన సాధనమేనని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాం. మరీ దుర్మార్గం గా పరిపాలిస్తున్న ప్రభుత్వాన్ని దించడానికది పని కొస్తుందే తప్ప ప్రభుత్వ విధానాలను బలంగా ప్రభావి తం చేయడానికి అది సరిపోదు.

అందుకే ప్రదర్శనలు, బంద్‌లు, రాస్తారోకోలు, సమ్మెలు, ఆమరణ నిరాహార దీక్షలు మొదలయిన ఆం దోళన రూపాలు ప్రజాస్వామ్యంలో భాగంగా ఎది గాయి. చట్టంలోని హక్కులను ప్రభుత్వం హరిస్తే కోర్టు ను ఆశ్రయించవచ్చును గానీ, కోర్టు జోక్యం చేసుకోజా లని ప్రభుత్వ విధాన నిర్ణయాలు ప్రజల హక్కులకూ బాగోగులకూ భంగకరమయినట్టయితే వాటిని ఎదుర్కొ నడానికి ఇటువంటి ఆందోళన రూపాలు చాలా అవసరం. వాటిని ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేవిగా కాక పెంపొందించేవిగా చూడాలి.

ఈ ఆందోళన రూపాల వల్ల ప్రజా జీవితానికి ఏ సమస్యలూ రావా అంటే వస్తాయి. ఒక్క నిరాహారదీక్ష తప్ప తక్కినవన్నీ ప్రజా జీవితాన్ని ఏదో ఒక మేరకు ఆటంకపరుస్తాయి, ప్రజలను ఏదో ఒక మేరకు ఇబ్బందికి గురిచేస్తాయి. అయితే ఆ కారణంగానే అవి ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టగలుగుతాయి. న్యాయస్థానాలు ఇటువంటి ఆందోళనల విషయంలో జోక్యమంటూ చేసుకుంటే, అది ప్రభుత్వానికి – ఆందోళనకు స్పందించవలసిన బాధ్యతనూ, ఆందోళనకారులకు – ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం పట్ల తాము అనుసరించవలసిన బాధ్యతాయుత వైఖరినీ జ్ఞాపకం చేయడానికే తప్ప ఆందోళనలను నిషేధించడానికి కాకూడదు.

ఈ ఆందోళన రూపాల వల్ల ప్రజా జీవితానికి ఏ సమస్యలూ రావా అంటే వస్తాయి. ఒక్క నిరాహారదీక్ష తప్ప తక్కినవన్నీ ప్రజా జీవి తాన్ని ఏదో ఒక మేరకు ఆటంక పరుస్తాయి, ప్రజలను ఏదో ఒక మేరకు ఇబ్బందికి గురిచేస్తాయి. అయితే ఆ కారణంగానే అవి ప్రభు త్వం పైన ఒత్తిడి పెట్టగలుగుతాయి. 'వాళ్లు సమ్మె చేసి ప్రజలను ఇంత ఇబ్బందికి గురిచేస్తుంటే ఈ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోదు?' 'వాళ్లు ఇన్ని గంటల సేపు రాస్తారోకో చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించదు?' అన్న నిరసన ప్రజలలో రాగలదు కాబట్టే ఈ ఆందో ళన రూపాలు పనిచేస్తాయి. అది ప్రజలకు ఇబ్బందికరమే. అయినప్పటికీ, ఇటువంటి ఆందోళన రూపాలు లేనట్టయితే ప్రజా వ్యతిరేకమైన ప్రభుత్వ విధానాలను నిలువరించడం సాధ్యంకాదని గుర్తించినట్టయితే, ఇటువంటి ఆందోళనలు చేపట్టేవారు బాధ్యతగా వ్యవహరించాలని అడగగలము తప్ప వీటిని పూర్తిగా నిషేధించడం ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదని అర్థం అవుతుంది.

ప్రజా జీవితాన్ని ఇబ్బందులకు గురిచేసే ఆందోళనలు చేపట్టే నిర్వాహకులు తాము దేనికోసం ఆందోళన చేస్తున్నాము, దాని తక్షణ సాధ్యాసాధ్యాలు ఏమిటి, ప్రభుత్వం ఎంత హేతుబద్ధంగా స్పందిస్తున్నది, ప్రజలకు ఎంత ఇబ్బంది కలుగుతున్నది మొదలయిన విషయా లను దృష్టిలో ఉంచుకొని బాధ్యతగా వ్యవహరించాలని అడగగలము. అడగాలి కూడా. న్యాయస్థానాలు ఇటువంటి ఆందోళనల విష యంలో జోక్యమంటూ చేసుకుంటే, అది ప్రభుత్వానికి – ఆందోళనకు స్పందించవలసిన బాధ్యతనూ, ఆందోళనకారులకు – ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం పట్ల తాము అనుసరించవలసిన బాధ్యతాయుత వైఖరినీ జ్ఞాపకం చేయడానికే తప్ప ఆందోళనలను నిషేధించ డానికి కాకూడదు. సరయిన ప్రజాస్వామ్య స్పృహ ఉన్నట్టయితే న్యాయస్థానాలు ఈ విషయాన్ని గ్రహించగలిగి వుండేవి.

## ఏది ప్రజాస్వామ్యానికి నిజమైన నష్టం?

కానీ అదే లోపించింది. ఇది కేవలం మన హైకోర్టు విషయమో లేక కేవలం జూనియర్ డాక్టర్ల విషయమో కాదు. మొత్తంగానే ఉద్య మించే హక్కు పట్ల న్యాయస్థానాలు తిరస్కార వైఖరిని అవలంబిస్తున్నాయి. దానిని ప్రజాస్వామ్యంలో భాగంగా కాక, ప్రజాస్వామ్యానికి నష్టకరమైన విషయంగా చూసే వైఖరి న్యాయస్థానాలలో ప్రబలింది. బంద్ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం, పికెటింగ్ రాజ్యాంగ విరుద్ధం, ఘెరావ్ నేరం, ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె చేయడం తప్పు మాత్రమే కాదు, వారిని విచారణ లేకుండ ఉద్యోగం నుండి తీసేయవచ్చు – ఒకదాని తరువాత ఒకటి ఇటువంటి తీర్పులొస్తున్నాయి. ఇప్పుడు డాక్టర్లు ఎట్టి పరిస్థితిలోనూ సమ్మె చేయడానికి వీలు లేదనీ, సమ్మె చేస్తే వైద్యులుగా వారు పొందిన రిజిస్ట్రేషన్‌ను సహితం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రద్దు చేయవచ్చుననీ మన హైకోర్టు ప్రకటించింది. రోగికి వైద్యం చేయడానికి వైద్యుడు నిరాకరించడం నేరమని చెప్పే మెడికల్ కౌన్సిల్ నియమం నుండి హైకోర్టు ఈ నిర్ధారణకు వచ్చింది. డ్యూటీలో ఉండి వైద్యం చేయడానికి నిరాకరించడం, ఒక న్యాయమైన లక్ష్యం కోసం సమ్మెలో ఉన్న కారణంగా విధులకు హాజరు కాకపోవడం ఒకటేనా? అటువంటి సమ్మెను చట్టవిరుద్ధం అని నిషేధించే కంటె అది త్వరగా ముగింపుకు రావడం కోసం ఇరువర్గాలపైనా ఒత్తిడి పెట్టడం న్యాయస్థానాలకు ఉచితమైన వైఖరి కాదా? వైద్యులు కేవలం తమ హక్కుల కోసమే సమ్మె చేసి ఉన్నా ఇది వర్తిస్తుంది. కానీ జూనియర్ డాక్టర్లు సమ్మె చేసింది ఒక ప్రజా ప్రయోజనం కోసం. వైద్య వ్యవస్థ, వైద్య విద్యా వ్యవస్థ వ్యాపార ప్రక్రియగా మారిపోవడాన్ని నిరసిస్తూ వారు సమ్మె చేశారు. అటువంటి సమ్మెకు ఇది మరింత ఎక్కువ వర్తించదా?

**ఆందోళనలలో న్యాయస్థానాలు జోక్యం అంటూ చేసుకుంటే ఈ వైఖరితో చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. లేకపోతే జోక్యమే చేసుకోకుండా ఉండడం మేలు. అంతే తప్ప సమ్మె చేయొద్దు, రాస్తారోకో చేయొద్దు, బంద్ నిర్వహించవద్దు, ఏవయినా సమస్యలుంటే కోర్టుకు రండి అని చెప్పి, కోర్టుకు వచ్చిన తరువాత మా పరిధి ఇంతే మేమింత కంటె ఎక్కువ చేయలేం పొండి అంటే ప్రజల సమస్యలు ఏ విధంగా పరిష్కారం కావాలి?**

16 సంవత్సరాల క్రితం ఒక కేసులో సుప్రీంకోర్టు పారిశ్రామిక కార్మికుల సమ్మె హక్కు గురించి ఇచ్చిన తీర్పును ఇక్కడ ఉటంకించడం ఉచితంగా ఉంటుంది. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఎప్పుడూ ఏవో పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శనలు జరుగుతుంటాయి. దేశ పారిశ్రామిక పురోగతికి చిహ్నంగా ఆ ప్రదర్శనలను భావిస్తారు. అక్కడ పనిచేసే కార్మికులు తమ కోర్కెల సాధన కోసం సమ్మె చేయగా, యాజమాన్యం దానిని దేశానికి అప్రతిష్ఠ తెచ్చే చర్యగా భావించింది. ఈ వివాదం సుప్రీంకోర్టు దాకా పోగా, జస్టిస్ అహ్మదీ ఈ విధంగా అన్నారు:

## అహ్మదీ తీర్పు

"సంఘాలు పెట్టుకొని వాటిని రిజిస్టర్ చేసుకునే హక్కును చట్టం గుర్తించింది. కార్మిక సంఘాలకు కొన్ని హక్కులు ఇవ్వడమే ఈ గుర్తింపు లక్ష్యం. కార్మికుల కష్టాల గురించి చెప్పుకోవడానికి, హక్కులు అడగడానికి కార్మిక సంఘాలు అవసరం అయ్యాయి. కార్మిక సంఘాలు కార్మికుల ప్రతినిధులు. కార్మిక సంఘం బలం దాని సభ్యత్వాన్ని బట్టి ఉంటుంది. ఎక్కువ సభ్యత్వం ఉన్న కార్మిక సంఘాలు యాజమాన్యంతో ఎక్కువ సమర్థతతో సంప్రదింపులు చేయగలుగుతాయి. కార్మిక సంఘాలకు ప్రదర్శనలు చేపట్టే హక్కును నిరాకరిస్తే ఈ సామర్థ్యం బలహీన పడుతుంది. సమ్మె అనేది ఒకరకమైన ప్రదర్శన మాత్రమే. వేరే ప్రదర్శన రూపాలు కూడా ఉన్నాయి. గో-స్లో, సిట్-ఇన్, వర్క్‌టు-రూల్, గైర్హాజరు కావడం మొదలయినవి. అటువంటి ప్రదర్శనా రూపాలలో సమ్మె ఒకటి. ప్రదర్శన జరిపే హక్కు, అందులో భాగంగా సమ్మె చేసే హక్కు, కార్మికులకు అందుబాట్లో ఉండే ఒక ముఖ్య సాధనం. అన్ని ప్రజాస్వామిక దేశాలూ ఈ హక్కును గుర్తించాయి.. అయితే పారిశ్రామిక న్యాయశాస్త్రంలో సమ్మె చేసే హక్కు అపరిమితమైనది కాదు. దానిని నియంత్రించే నియమాలున్నాయి... (యాజమాన్యం సిబ్బంది జీతాలు పెంచి కార్మికులవి మాత్రం పెంచని యాజమాన్య వైఖరికి ఆగ్రహించిన కార్మిక ప్రతినిధులు) సమ్మె చేయడం ద్వారా ఒత్తిడి పెట్టాలని నిర్ణయించుకున్నారు. సమ్మె సందర్భంగా కొన్ని అవాంఛనీయ ఘటనలు జరిగిన మాట వాస్తవమే. అయితే విధ్వంసమేమీ జరగలేదు... ఘాటయిన మాటలు అనుకోవడం జరిగింది. దానిని యాజమాన్యం 'బెదిరింపు'గా అభివర్ణించింది... ఇరువర్గాల ప్రవర్తనను మేము అప్పటి పరిస్థితుల నేపథ్యంలో చూస్తున్నాం... తప్పొప్పులు ఎంచి విద్వేషాలను ఇంకింత పెంచే బదులు సంస్థ దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంక్షోభాన్ని పరిష్కరించదలచుకున్నాం.."

## ఇప్పుడే మరింత రక్షణ అవసరం

ఆందోళనలలో న్యాయస్థానాలు జోక్యం అంటూ చేసుకుంటే ఈ వైఖరితో చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. లేకపోతే జోక్యమే చేసుకోకుండా ఉండడం మేలు. అంతే తప్ప సమ్మె చేయొద్దు, రాస్తారోకో చేయొద్దు, బంద్ నిర్వహించవద్దు, ఏవయినా సమస్యలుంటే కోర్టుకు రండి అని చెప్పి, కోర్టుకు వచ్చిన తరువాత మా పరిధి ఇంతే మేమింత కంటె ఎక్కువ చేయలేం పొండి అంటే ప్రజల సమస్యలు ఏ విధంగా పరిష్కారం కావాలి?

ఇది ఎప్పుడయినా ఉండే విషయమే గానీ, ప్రభుత్వ విధానాలు ప్రజానుకూలంగా ఉండనక్కరలేదని దేశ పాలకులు బహిరంగంగా ప్రకటించుకుని తిరుగుతున్న తరుణంలో ఉద్యమించే హక్కుకు రక్షణ మరింత అవసరం. ఈ మధ్య మన హైకోర్టు జోక్యం చేసుకున్న రెండు సమ్మెలూ - జూనియర్ డాక్టర్లదీ, ఆర్టీసీ కార్మికులదీ - ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం జరిగినవే తప్ప వారి కోసం వారు చేసుకున్నవి కావు. ఇటువంటి ఆందోళనలు ఇంకా చాలా జరగబోతాయి కాబట్టే ఉద్యమించే హక్కు పట్ల కోర్టులు అనుసరిస్తున్న వైఖరి గురించి మాట్లాడుకోవడం అవసరం.

**29 ఆగస్టు 2005**

మానవహక్కుల వేదిక
Human Rights Forum (HRF)